వృథాగా కృష్ణానీరు

- పది రోజులుగా రాగన్నగూడలో తాగునీరు నేలపాలు
- నిధులు లేవు, మరమ్మతులు చేయలేమంటున్న అధికారులు


రాగన్నగూడ షిరిడీపురం కాలనీలో వృథాగా పోతున్న కృష్ణానీరు

హయత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పది రోజులుగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని షిర్డిపురం కాలనీ రోడ్డు నంబర్ 3 వద్ద కృష్ణా వాటర్ పైపులైన్ లీకేజీ అయి తాగునీరంతా రోడ్డు పాలవుతోంది. అయినా హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్ అధికారులు పట్టించోవడం లేదు. తాగునీరు వృథాగా పారుతున్న దృశ్యాలను చూసిన స్థానికులు ఏఈ, లైన్‌మెన్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. పైగా 'మా వద్ద నిధులు లేవు. మీరే సొంతంగా రిపేరు చేయించుకోండి' అని ఉచిత సలహాలు ఇస్తున్నారని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి : అరుణ


టైల్స్ పనులను పరిశీలిస్తున్న అరుణారెడ్డి

సైదాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి సూచించారు. మంగళవారం బీ బ్లాక్ కాలనీ పార్కులోవాకింగ్ పాత్ టైల్స్ పనులను పరిశీలించారు. కొందరు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంవల్ల జరుగుతున్న నిర్మాణ పనుల జాప్యంపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ మాజీ సభ్యురాలు లత, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'చిమ్మపూడి' ఆధ్వర్యంలో పద్యాల పోటీలు

కొత్తపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూనాగోల్‌లో గల చిమ్మపూడి ఫౌండేషన్ వారు పద్యాల పోటీలను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు చిమ్మపూడి శ్రీరామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. భావ, రాగయుక్తంగా ఏవైనా 2 పద్యాలు పాడాలని, జూనియర్(8 నుంచి 10 వ తరగతి విద్యార్థులు), సీనియర్(ఇంటర్, డిగ్రీ, ఆపై తరగతుల వారు) విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 9704177270 నంబర్‌లో సంప్రదించాలన్నారు.


ప్రగతి చక్రం అవార్డులతో ఆర్టీసీ ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు పంపిణీ

హయత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మంగళవారం హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఆర్‌ఎం సీఓ సుచరిత ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు చక్కగా క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రయాణికులకు సేవలు అందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. మహాలక్ష్మి పథకం తరువాత బస్సుల్లో అత్యధికంగా ఓఆర్ సాధించి, సంస్థను లాభాల బాటలో తీసుకురావాలని కోరారు. అనంతరం డిపోలో ఉద్యోగులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్, సీఐ శాలిని, ఎంఎఫ్ బాలయోగేశ్వరితో పాటు పలువురు పాల్గొన్నారు

రోడ్డు పనులను పూర్తిచేయాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శాతవాహన కాలనీ, విజయపురి కాలనీ ఫేస్-1లోని సాయిబాబా దేవాలయం వద్ద చేపట్టబోయే రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల చేపట్టిన డ్రైనేజీ పనులు పూర్తి కావడంతో అట్టి రోడ్లను ఆధునికీకరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఈఈ రమేష్ బాబు, డీజీఎం రాజగోపాల్, ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనేజర్ సిరివెన్నెలతో కలిసి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన కాలనీ అధ్యక్షులు నందిరాజు లక్ష్మీనారాయణ, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బధిర ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఓల్డ్ మలక్‌పేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిర ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేటలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలోకి బధిర ఆశ్రమ పాఠశాల మార్చామన్నారు. బధిర విద్యార్థులకు 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో కొనసాగుతున్నదని చెప్పారు. ఒకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం ఇస్తామన్నారు. అబ్బాయిలకు రెసిడెన్షియల్, అమ్మాయిలకు డేస్కాలర్ విధానం ఉందన్నారు. విద్యార్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పాఠశాలలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. వివరాలకు 9440362946, 9490942597 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చిన్నారుల కొనుగోలు కేసు

పూణెలో మరో ఐదుగురి అరెస్ట్

- మరో ముగ్గురు చిన్నారులను రక్షించిన పోలీసులు


ఇటీవల రక్షించిన చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తున్న సీపీ తరుణ్ జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన చిన్నారుల కొనుగోలు కేసులో రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మరో ముగ్గురు చిన్నారులను రక్షించినట్లు సీపీ తరుణ్‌జోషి మంగళవారం తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అయి విక్రయించబడిన 15 మంది చిన్నారులను ఇటీవల రాచకొండ పోలీసులు రక్షించి, నిందితుల ముఠాను కటకటాల్లోకి నెట్టిన విషయం తెలిసిందే. రక్షించిన చిన్నారులను బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇప్పటి వరకు మొత్తం రాచకొండ పోలీసులు రక్షించిన చిన్నారుల సంఖ్య 18కి చేరిందని సీపీ తెలిపారు. చిన్నారులను అక్రమ రవాణా చేయడంలో పూణె, ఢిల్లీ ముఠాల హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పూణె పోలీసులు చిన్నారుల కొనుగోలు కేసులో 9 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిసింది. వీరికి నగరంలో దొరికిన ముఠాలతో లింకులపై రాచకొండ పోలీసులు ఆరా తీయగా.. ఐదుగురు నిందితులకు సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో వారిని పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారించి ఢిల్లీ ముఠాలతో ఉన్న లింకులపై సమాచారం రాబడతామని సీపీ తెలిపారు. త్వరలోనే ఢిల్లీ ముఠాలను గుర్తిస్తామన్నారు. ముఠాల గుట్టు వీడితే ఆ చిన్నారులను ఎక్కడ తెచ్చారు..? వారి తల్లిదండ్రులు ఎవరు..? అనేది తేలాల్సిన అవసరం ఉందని, అందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

టమాట, పచ్చిమిర్చి కిలో..

రూ. 100 పైనే..

కొండెక్కిన కూరగాయల ధరలు



సైదాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. కిలో టమాట, మిర్చి సెంచరీపైనే పలుకుతోంది. మిగతా కూరగాయల ధరలూ కిలో రూ.50 నుంచి 90 లోపు ఉన్నాయి. మాదన్నపేట మార్కెట్‌లో టమాటా, పచ్చిమిర్చి, బీన్స్, క్యాప్సికమ్, చిక్కుడు, ఇలా ఏది కొందామన్న ధరలు దడ పుటిస్తున్నాయి. మంగళవారం మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో బెండకాయ కిలో రూ.90, బీన్స్70, ఫ్రెంచ్ బీన్స్ రూ.160, వంకాయ రూ.50, క్యాప్సికం రూ.80, బీట్‌రూట్ రూ.40, దోసకాయ రూ.50 క్యారెట్ రూ.80 ధరలు పలికాయి.

ఠారెత్తిస్తున్న టమాట

ప్రధానంగా ప్రతి వంటలోనూ టమాటను వాడుతుంటారు. కొద్ది నెలల పాటు టమాట ధరలు రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండగా మార్కెట్లు, రైతు బజార్లలో రూ.100 వరకు పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో చిరువ్యాపారులు రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎప్పుడూ లేనివిధంగా టమాటా కిలో రూ.100పైగా పెరిగింది. ఈ సంవత్సరం జనవరిలో కిలో రూ.20 ఫిబ్రవరిలో రూ.20, మార్చిలో రూ.12, ఏప్రిల్‌లో రూ.20 మేలో రూ.25, ధర పలికిన టమాట ప్రస్తుతం ఏకంగా వంద రూపాయలకు పైగా చేరడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. గత నెలతో పోల్చుకుంటే ప్రస్తుతం టమాటా ధర ఏకంగా నాలుగింతలు పెరిగింది.

మండుతున్న పచ్చిమిర్చి...

నెల రోజులుగా పచ్చిమిర్చి ధరలు మండుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో పచ్చిమిర్చి ధరలు కిలో రూ.50 ఉండగా, ప్రస్తుతం కిలోధర రూ.100కి పైగా పలుకుతోంది. అయినా మార్కెట్‌లో సరుకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉన్నాయి.

వర్షాలపై ఆశలు...

కొద్ది రోజులుగా భానుడి ప్రతాపంతో కూరగాయల సాగుకు ఇబ్బంది నెలకొంది. మాదన్నపేట మార్కెట్‌కు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూరగాయలు వస్తుంటాయి. అంతేగాకుండా నగర శివారు ప్రాంతాల నుంచి కూరగాయలతో పాటు ఆకు కూరలను నిత్యం రైతులు తీసుకువస్తుంటారు. వర్షాలు ఎంత త్వరగా కురిసి సాగుచేసి కూరగాయలు అందుబాటులోకి వస్తేగాని ధరలు తగ్గవని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

రూ.500 తీసుకెళ్తే ...



కూరగాయల కోసం రూ.500 తీసుకు వెళ్తే చిన్న సంచి కూడా నిండటం లేదు, ప్రతి వంటలో టమాట వేయాల్సి ఉంటుంది. గత నెలలో కిలో రూ.25 ఉండగా, ఇప్పుడు ఏకంగా రూ.100కి పెరిగింది. ఒకప్పుడు వారానికి రెండు, మూడు కిలోలు తీసుకెళ్లే వాళ్లం. ఇప్పుడు కిలో తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడింది.

- ఇందూరి లత, మలక్‌పేట

పేదల పరిస్థితి దయనీయం



రెక్కాడితే గానీ డొక్క నిండని పేదల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంది. మండుతున్న ధరలను చూసి, కూరగాయలు కొనడం లేదు. రోజుకు వంద రూపాయల కూరగాయలకు వెచ్చించాల్సి వస్తోంది, పేదలు ధరలు చూసి ఆందోళన చెందుతున్నారు. తక్కువ ధర ఉన్న కూరగాయలు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ రెట్లతో కూరగాయలు అందించాలి.

- కొరుడు భూమేశ్వర్, మాజీ వైస్‌చైర్మన్, మలక్‌పేట మార్కెట్

హనుమాన్ దేవాలయ హుండీ ఆదాయం రూ.32.89 లక్షలు


హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఏసీ టి.శేఖర్, ఈవో ఎం.శ్రీనివాసశర్మ

చంపాపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో మంగళవారం హుండీలను లెక్కించారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.శేఖర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈవో ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. 82రోజులకు హుండీలను లెక్కించగా ఆలయానికి రూ.32,89,015 వచ్చిందన్నారు. దీంతోపాటు 329 అమెరికా డాలర్లు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, కళ్యాణ్ చక్రవర్తి, బిల్లకంటి కిరణ్‌కుమార్, మేక సురేందర్‌రెడ్డి, గూడూరు మధుసూదన్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, చాతిరి మధుసూదన్ సాగర్, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్, మేకల యాదగిరి, సాంబరాజు శైలజ, ఆలయ అర్చకులు, శ్రీ భ్రమరాంబికా సేవా సమితి వలంటర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో చైన్ స్నాచింగ్

చాదర్‌ఘాట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మహిళమెడలోని మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి పది గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. మలక్‌పేట్ ముంతాజ్ కాలేజీ ప్లేన్‌లోని అనసూయ రెసిడెన్సీలో నివాసముంటున్న విజయమ్మ-నరసింహ దంపతులు తమ ఇంటికి సమీపంలోని అనిత నర్సింగ్ హోమ్ ఎదుట మెడికల్ హాల్ నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే మెడికల్ హాల్‌ను మంగళవారం రాత్రి మూసివేసి ఇంటికి నడుచుకుంటూ వారు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు విజయమ్మ మెడలోని నాలుగు తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు మలక్‌పేట ఎస్సై నవీన్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



కొత్తపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మన్సూరాబాద్ చౌరస్తాలో గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా.. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపేదలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి


కేవీఆర్ కిట్‌లను ప్రదానం చేస్తున్న రమణాచారి

రవీంద్రభారతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు, దివ్యాంగులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని రిటైర్డ్ ఐఏఎస్ రమణాచారి అన్నారు. మంగళవారం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఎల్‌పీడీఓ అధ్యక్షుడు భరత్ సంగం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి నిరుపేదలకు, దివ్యాంగులకు కేవీఆర్ కిట్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని అన్నారు. ఎంతోమంది అనాదులైన అభాగ్యులకు అండగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈతరం యువత ముందుకు రావాలని కోరారు. దివ్యాంగులపై సానుభూతి కాద సహకారం కాదు సమాన హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మాజీ ఎండి వైద్యనాథ్, వసుంధర, కన్నారావు, వీఆర్. శ్రీనివాస్, మాయ బ్రహ్మం మహంకాళి రవీందర్, శ్రీను, శంకర్, బాలకృష్ణ, గోవింద్, గంగమ్మ, సమంత, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేశాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

డబ్ల్యూపీఐ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి


మాట్లాడుతున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి

ఎల్బీనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కులగణన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు వెంకటస్వామిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల జనగణన అనంతరమే స్థానిక సంస్థలో బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అదికూడా బీసీ, ఎంబీసీలకు వర్గీకరణతో కూడిన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రగతి సాధించగలదని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సంకేటి శంకర్, శంకర్‌గౌడ్, రవీందర్‌గౌడ్, నాగన్న, రవీందర్, ధనుంజయ కుమ్మరి, మంజుల, పద్మమ్మ, ముంత జ్యోతి, శ్యాంపలి సురేష్, సాగర్, జయలక్ష్మీ, శ్రీలత, శ్వేత, భారతమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

140 టన్నుల 'బక్రీద్' పశువ్యర్థాల తరలింపు

జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో..


పశువ్యర్థాల తరలింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్కిల్-6 డీసీ జయంత్

చాదర్‌ఘాట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని ఆరు డివిజన్లలో పశువ్యర్థాల తరలింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సర్కిల్-6 డీసీ జయంత్, శానిటేషన్ విభాగం డీఈ వెంకట్‌రాజుల పర్యవేక్షణలో సోమ, మంగళవారాల్లో నాలుగు షిఫ్టులుగా పనిచేసిన శానిటేషన్ సిబ్బంది 280 ట్రిప్పుల ద్వారా 140 టన్నుల పశువ్యర్థాలను తరలించినట్లు శానిటేషన్ సూపర్‌వైజర్ గోవిందరెడ్డి తెలిపారు. చావునీ, ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధుల్లో పశువ్యర్థాల తరలింపు కోసం దాదాపు 30వేల కవర్లను జీహెచ్‌ఎంసీ ద్వారా పంపిణీ చేశామన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన బక్రీద్ వేడుకలు బుధవారం వరకు కొనసాగనున్నాయి. పశు వ్యర్థాల తరలింపు కోసం 11 జేసీబీలు, 29 లారీలను సిద్ధం చేయగా మంగళవారం సాయంత్రం వరకు 29 లారీలు 280 ట్రిప్పులు తిరిగాయని, ఇంకా వ్యర్థాల తరలింపు ఉందని, బుధవారం సాయంత్రం వరకు తరలింపు పనులు కొనసాగుతుందన్నారు. ఇందు కోసం 14 మంది శానిటేషన్ జవాన్లు, 38 మంది ఎస్‌ఎఫ్‌ఏలు, శానిటేషన్ సిబ్బందితోపాటు మరో 36 మంది ప్రైవేట్ సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

- అదుపుతప్పి కారు బోల్తా



హైదరాబాద్ శివారు కొత్తగూడెం వద్ద విజయవాడ జాతీయ రహదారిపై అదుపుతప్పి కారు బోల్తా పడింది. కారు విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలిసింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు మాత్రమే ఉన్నట్లు సమాచారం. అదృష్టవశాత్తు ఎవ్వరికి కూడా ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.

- అబ్దుల్లాపూర్‌మెట్,ఆంధ్రజ్యోతి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేస్తున్న వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ చెవుల హరిశంకర్‌ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, జగన్‌మోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వసతి కల్పించండి

హయత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని బ్లడ్ బ్యాంకు కాలనీలో పూర్తి స్థాయి భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైపులైను వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డితో కలిసి వెళ్లి జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు నర్సింహారెడ్డి, గాలయ్యగౌడ్, జంగారెడ్డి, మురళీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బాబుల్‌రెడ్డి, కళ్యాణ్‌రెడితో పాటు పలువురు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

చంపాపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీలలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సుజాతనాయక్ మంగళవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జడ్సీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు కార్పొరేటర్ తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్, ఎస్ఈ అశోక్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

ఎంపీ ఈటలను కలిసిన కార్పొరేటర్, బీజేపీ నేతలు

చంపాపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంపీ సహకారంతో చంపాపేట డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రజిత, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, కవిత తదితరులు పాల్గొన్నారు.